

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 171 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 03-01-2025 | పేజీలు : 5

# భారీ పెట్టుబడులు సాకారం!

- పట్టాలెక్కనున్న బీపీసీఎల్, టీసీఎస్ ప్రాజెక్టులు
- రామాయపట్నంలో భారీ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు
- విశాఖలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్యకలాపాలు
- రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- కనిగిరిలో కంప్రెస్డ్ బయో గ్యాస్ విద్యుత్ ప్లాంటు
- కాకినాడ, నంద్యాల, కడప, పత్తికొండలో కొత్తగా రానున్న ఇంధన ఆధారిత ప్లాంట్లు
- కనిగిరిలో బయోగ్యాస్ ప్లాంటు

**అమరావతి, జనవరి 2 (జనస్వరం) :** రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రానున్నాయి. ప్రతిష్ఠాత్మక బీపీసీఎల్, టీసీఎస్ ప్రాజెక్టులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈ రెండు ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఇవి కార్యరూపం దాలిస్తే రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రమే మారిపోతుంది. అనుబంధ పరిశ్రమల రాకతో పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీయనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతిపాదనల ప్రకారం.. నెల్లూరు జిల్లా రామాయపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ.96,862 కోట్ల అతి భారీ పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు కానుంది. మొత్తం 9మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఐదు బ్లాకుల్లో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రో కెమికల్స్ యూనిట్స్, క్రూడాయిల్ టెర్మినల్, గ్రీన్‌హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే 20 ఏళ్లలో రాష్ట్రానికి రూ.88,747 కోట్ల ఆదాయం లభిస్తుంది. 2,400 మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2029లోపే ఈ మొత్తం ప్రాజెక్టును పూర్తిచేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. బీపీసీఎల్ కూడా ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసేందుకు చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. రూ.6,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రీ-ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు, రామాయపట్నంలో భారీ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ఏర్పాటు ప్రతిపాదనను కూడా బీపీసీఎల్ బోర్డు ఇప్పటికే ఆమోదించింది. స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కోసం ఈ సమాచారాన్ని అందిస్తూ వెంటనే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎసఈ), బోంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (బీఎస్ఈ)లకు ఇటీవలే లేఖ కూడా రాసిం ది. ఈ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద కసరత్తే చేశారు. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్ దీనికోసం పోటీ పడగా.. చంద్రబాబు ప్రధాని మోదీతో చర్చలు జరిపారు. ప్రాజెక్టుకు అవసరమైన భూములు, మౌలిక సదుపాయాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని, ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు కావలసిన వనరులు కూడా రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని వివరించారు. తర్వాత రాష్ట్ర అధికారుల బృందం బీపీసీఎల్ ప్రతినిధులతో పలు దఫాలు సంప్రదింపులు జరిపింది. దరిమిలా బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీని రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి సానుకూలత వ్యక్తం చేసింది. అయితే మచిలీపట్నంలో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావించగా.. బీపీసీఎల్ మాత్రం రామాయపట్నంపై ఆసక్తి చూపింది. సీఎం కూడా అంగీకరించారు. రాష్ట్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపింది.



**విశాఖలో టీసీఎస్‌కూ ఓకే**

దిగ్గజ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) విశాఖలో రూ. 80కోట్లతో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ సంస్థ కార్యకలాపాలు ప్రారంభంకానున్నాయి. తొలిదశలో 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. తర్వాత టీసీఎ స్‌ను మరింత విస్తరిస్తారు. అప్పుడు 10వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. విశాఖలోని రుషికొండ ఐటీపార్కు హిల్-2పై నాన్ సెజ్ ఏరియాలో డల్లాస్ టెక్నాలజీస్ సంస్థ నిర్మించిన భవనంలో లీజు ప్రాతిపదికన ఆఫీసు ఏర్పాటుకు టీసీఎస్ ముందుకు రాగా.. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే డల్లాస్ భవనంలో 1400 మంది వరకు మాత్రమే పనిచేయడానికి స్థలం సరిపోతుంది. ఈ నేపథ్యంలో టీసీఎస్ ప్రతిపాదనల మేరకు సీటింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు పక్కనే ఖాళీగా ఉన్న స్థలాన్ని అదనంగా కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్రంలో ఐటీ కేంద్రంగా అభివృద్ధి సాధిస్తున్న విశాఖలో యాంకర్ కంపెనీలు లేకపోవడం ఇంతవరకు పెద్ద లోటుగా ఉండేది. ఈ లోటును భర్తీ చేయడంపై ఐటీ మంత్రి లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖకు టాప్-10 కంపెనీలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలోనే టీసీఎస్ ప్రతినిధులతో చర్చలు జరిపి. వారిని విశాఖకు ఆహ్వానించారు. ఇన్ఫోసిసకు పక్కనే టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభమైతే విశాఖ ఐటీ కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఈ భారీ ప్రాజెక్టులు కార్యకలాపాలను ప్రారంభిస్తే.. అనుబంధ పరిశ్రమలతో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుంది. వేలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పునరుత్పాదక విద్యుత్ రంగంలో కొత్త టెక్నాలజీతో దేశంలో మొదటిసారిగా రెండు ప్లాంట్లను హీరో సంస్థ మన రాష్ట్రంలో ప్రారంభించబోతోంది. మంత్రివర్గ సమావేశంలో అధికారులు ఈ విషయం తెలిపారు. పవన, సౌర విద్యుత్, బ్యాటరీ ప్రాజెక్టుల కలయికతో కడప, నంద్యాల జిల్లాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. బ్యాటరీలను కూడా కలిపి ఇంతవరకూ దేశంలో ఎక్కడా ఈ తరహా ప్లాంట్లు లేవు. సౌర, పవన విద్యుత్‌ను ఈ బ్యాటరీల్లో నిల్వ చేసి వాటిని గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. 249 మెగావాట్ల సామర్థ్యంతో ఇవి ఏర్పాటు కానున్నాయి.

**మరిన్ని నిర్ణయాలు..**

- మెస్సర్స్ ఏఎం గ్రీన్ అమ్మోనియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కాకినాడలో ఒక ఎంఎంటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమ్మోనియా తయారీ సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటుకు ఆమోదం.
- రెండు గిగావాట్ ఎలక్ట్రోలైజర్ తయారీ సామర్థ్యంతో కాకినాడలో ప్లాంటు ఏర్పాటుకు జూస్ కాకెరిల్ గ్రీన్‌కో హైడ్రోజన్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు గ్రీన్‌సిగ్నల్.
- టాటా పవర్ రెన్యువబుల్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హొసూరు, పెద్ద హులిటీ గ్రామాల్లో 400 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు ఆమోదముద్ర.
- బస్సుల బాడీ బిల్డింగ్ సంస్థ ఆజాద్ ఇండియా మొబిలిటీ లిమిటెడ్ రూ. 1,046 వేల కోట్ల పెట్టుబడితో శ్రీసత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేసే ప్లాంటుకు 70.7 ఎకరాలు కేటాయింపు. ఎకరా ధర రూ.38.37 లక్షలు.
- బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో ఉడ్ ఫ్యాక్టరీ స్థాపనకు అంగీకారం.

# తెలుగు మహోన్నతం

- బడుల్లో పిల్లలకు తెలుగు వ్యాకరణం నేర్పించాలి
- సాహిత్యంతో మనస్సు, మేధస్సు వికసిస్తుంది
- మాతృభాష రక్షణకు పుస్తక ప్రదర్శనలు దోహదం
- సృజనాత్మకత పెంపునకు పుస్తక పఠనం ముఖ్యం
- రచయితల గుర్తులను పర్యాటకంగా మార్చాలి
- 'సూర్యరాయాంధ్ర' నిఘంటువు పునఃప్రచురణకు
- అయ్యే మూడో వంతు ఖర్చును నేనే భరిస్తా
- విజయవాడలో పుస్తక మహోత్సవం ప్రారంభ
- కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**విజయవాడ, జనవరి 2 (జనస్వరం) :** "పిల్లలకు అన్ని పాఠశాలల్లో తెలుగు వ్యాకరణం నేర్పించాలి. దీనిపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి. తెలుగు అధ్యాపకులకు సమాజంలో ఎక్కువ వేతనాలు ఉండాలి. మాతృభాషపై పూర్తిస్థాయిలో పట్టు సాధించినప్పుడు.. ఇంగ్లిష్ నేర్చుకోవడం సులభమవుతుంది. మాతృభాషలో నైపుణ్యం లేకుండా ఏ భాషలోనూ పట్టు సాధించలేం. సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి, కొత్త దృక్కోణాల ఆవిష్కరణలకు పుస్తక పఠనం చాలా అవసరం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 35వ పుస్తక మహోత్సవాన్ని ఆయన గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాతృభాష పరిరక్షణకు పుస్తక ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విజయవాడ రచయితలకు పుట్టినిల్లు అని కొనియాడారు. ప్రముఖ రచయితలు రచనలు చేసిన ప్రదేశాలను, వారు నివసించిన ఇళ్లను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. అటువంటి వారి చిహ్నాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న గ్రంథాలయాలను సాహితీ కేంద్రాలుగా మార్చాలని పవన్ అభిప్రాయపడ్డారు. ఇక్కడ సాహితీవేత్తలు కూర్చునేలా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, ఇదొక ఉద్యమంలా సాగాలని పిలుపునిచ్చారు. సాహిత్యంపై పట్టున్న బలమైన సమాజాన్ని ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. పఠనం మాటెలా ఉన్నా, వాక్య నిర్మాణం చేసేటప్పుడు తప్పులు లేకుండా రాయాలంటే చాలా కష్టపడాలన్నారు. పుస్తక పఠనం వల్ల రచయితల ఆలోచనా విధానం, దృక్కోణం అర్థమవుతాయని చెప్పారు. తెలుగులో అద్భుతమైన సాహిత్యం ఉందని, దాన్ని చదివినప్పుడు మనస్సు, మేధస్సు ఎంతో వికసిస్తాయని పవన్ తెలిపారు. పద ప్రయోగంపై పట్టు ఉండాలని స్పష్టం చేశారు. జ్ఞానం ఉన్న వాళ్లు ఎక్కువగా మాట్లాడరని, అటువంటి వారి వద్దకు వెళ్తే అనేక విషయాలు తెలుస్తాయని అన్నారు. సనాతన ధర్మంపై తిరుపతిలో ప్రసంగం రాసుకోవడానికి ఏడు గంటల సమయం పట్టిందని వెల్లడించారు. శ్రీశ్రీ వేదన నుంచి 'మహాప్రస్థానం', బాలగంగాధర తిలక్ జ్వలించడంతో 'అమృతం కురిసిన రాత్రి' వెలువడ్డాయని చెప్పారు.

**అందుకు ఇప్పటికీ బాధపడుతున్నా..**

తాను తెలుగు భాషను సరిగా నేర్చుకోలేదని, దానికి ఇప్పటికీ బాధపడుతున్నానని డిప్యూటీ సీఎం పవన్ విచారం వ్యక్తం చేశారు. తెలుగు అధ్యాపకులను సరిగా అర్థం చేసుకోలేకపోయాయని బాధపడ్డారు. ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేయడం ఇష్టం లేక కాదని, తాను కోరుకున్న చదువు పుస్తకాల్లో లేకపోవడంతోనేనని వివరించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్ఫూర్తితో సొంతంగా తెలుగు నేర్చుకున్నానని తెలిపారు. పుస్తకాలు చదవడం వల్ల మానసిక శక్తి బలోపేతం అవుతుందన్నారు. విశ్వనాథ సత్యనారాయణ పత్రికల్లో నడిపిన హాహాహూహూ ధారావాహికం చదివినప్పుడు సంస్కృతిలోని గొప్పదనం తెలిసిందన్నారు. వనవాసి నవల ప్రకృతిని పరిచయం చేసిందన్నారు. క్లాసికల్ తాను ఎవరికైనా రూ.కోటి ఇవ్వడానికి ఆలోచించబోనని, పుస్తకాలు ఇవ్వడానికి మాత్రం ఆలోచిస్తానని తెలిపారు.

**మూడో వంతు నేను భరిస్తా**

సూర్యరాయాంధ్ర నిఘంటువు పునః ప్రచురణకయ్యే ఖర్చులో మూడో వంతు తాను భరిస్తానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ నిఘంటువును పునః ప్రచురించడానికి రూ.1.70 కోట్లు అవసరమవుతుందన్నారు. ఈ ఖర్చులో మూడో వంతు తాను భరిస్తానని మిగిలిన నిధులను కేంద్ర సాహిత్య అకాడమీ గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

**'పీవీ' ఠీవి కోసం పోరాటం చేయాలి**

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఢిల్లీలో తగిన గుర్తింపు వచ్చే వరకు తెలుగు వారంతా పోరాటం చేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు రాసిన 'భారతీయ సాహిత్య నిర్మాతలు-పాములపర్తి వెంకట నరసింహారావు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

**నాకు పుస్తకాలంటే ప్రాణం**

పవన్‌కల్యాణ్ ప్రసంగిస్తుండగా ఆయనఅభిమానులు ఓజీ... ఓజీ... అంటూ నినాదాలు చేశారు. దీనికి ఆయన నవ్వుతూ ఓజీ... ఓజీ...అనడం కంటే శ్రీశ్రీ అనడం తనకు ఇష్టమని చెప్పారు. "నాకు పుస్తకాలు ప్రాణం. నేను ఈ స్థాయికి వచ్చానంటే దానికి పుస్తకాలు కారణం." అని తెలిపారు. ప్రసంగాలను తానే రాసుకుంటానని, భగవంతుడు ఆశీస్సులు అందజేస్తే తప్పకుండా పుస్తకం రాస్తానని చెప్పారు. టీవీలు, సోషల్ మీడియాతో గడపకుండా పుస్తకాలను చదవాలని సూచించారు. తొలిప్రేమ చిత్రానికి తనకు రూ.15 లక్షలు రెమ్యునరేషన్ ఇస్తే అందులో రూ.1 లక్షతో పుస్తకాలు కొనుగోలు చేశానని తెలిపారు. ఒక మనిషి జీవితకాలంలో 10 వేల పుస్తకాలను చదవగలడని తెలిపారు.

## జీవితం - ఓ "చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 01 జనవరి 2025,**

**తిథి :** శుద్ధ పాడ్యమి (తె.03:25వ.కు), శుద్ధ విదియ (02తా తె.02:26 వ.కు), **నక్షత్రం :** ఉ/షాఢ (రా.11:48వ.కు),

**బ్రహ్మ ముహూర్తం :** తె.04:55ల తె.05:43

**రాహుకాలం :** మ.12:01ల మ.01:23,

**యమగండం :** ఉ.07:54 ఉ.09:16,

**వర్జ్యకాలం :** ఉ.08:01ల ఉ.09:16,

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 01 జనవరి 2025**

**ఫజర్ :** తెల్లవారుజామున గం. 05:29

**సూర్యోదయం :** ఉదయం గం. 06:44

**జొహర్ :** మధ్యాహ్నం గం. 12:24

**అసర్ :** సాయంత్రం గం. 03:38

**మఘ్రిబ్ :** సాయంత్రం గం. 06:02

**ఇష :** రాత్రి గం. 07:18



డిజిటల్ పోటి ప్రపంచంలో ఎదగాలంటే వెబ్ సైట్ తప్పనిసరి.
అతి తక్కువ ధరకే చేయబడును
- న్యూస్ వెబ్ సైట్
- ఈ పేపర్ వెబ్ సైట్
- ఇన్ఫర్మేషన్ వెబ్ సైట్
- బిజినెస్ వెబ్ సైట్
- వ్యక్తిగత వెబ్ సైట్
- ఆర్గనైజేషన్ వెబ్ సైట్

సెల్/వాట్సప్ +91-9642067900 వివరములకు సంప్రదించండి
• మీకు నచ్చిన విధంగా చేయబడును
WEB DIGITAL WAY
Visit www.webdigitalway.com

జన స్వరం
**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# విధ్వంసకారి, ఆర్థిక ఉగ్రవాది జగన్ రెడ్డి

**- పెట్టుబడిదారుల్ని తరిమేసి, ప్రాజెక్టుల్ని అడ్డుకుని రాష్ట్ర సంపదకు గండి కొట్టాడు**

**- జగన్ అండ్ కో అవినీతి అక్రమాలతో కుప్పకూలిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ**



ఒక్క ఛాన్స్ అంటూ కాళ్ళా వేళ్ళ పడి గద్దెనెక్కిన జగన్ రెడ్డి ఐదేళ్ల పాటు ఆర్థిక ఉగ్రవాదిలా ప్రవర్తించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాడు. అన్ని వ్యవస్థలను నాశనం చేసి గడిచిన ఐదేళ్ల పాటు కనీవినీ ఎరుగని రీతిలో దోపిడీ చేశారు జగన్ రెడ్డి అండ్ కో. ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసి, ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకం చేసి దేనికీ సరైన లెక్కలు, జమ ఖర్చులు లేకుండా జగన్ రెడ్డి ప్రభుత్వం అంకెల గారడీతోనే కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా తప్పుదారి పట్టించింది. అస్తవ్యస్థ ఆర్థిక నిర్వహణతో రాష్ట్ర పరిస్థితి 20 ఏళ్ళు వెనక్కి నెట్టి ఏపీని నిండా ముంచాడు జగన్ రెడ్డి. అక్కసుతో రాజధాని అమరావతిని, ఏపీ జీవనాడి పోలవరాన్ని పాడు బెట్టాడు. విద్యుత్ బకాయిలు పెట్టి ఓపెన్ మార్కెట్లో విద్యుత్తు కొని విద్యుత్ శాఖను 1.29 లక్షల కోట్ల నష్టంలోకి నెట్టేశాడు. రాష్ర ప్రజల భూములు దోచుకోవడానికి 22ఏ తీసుకొచ్చాడు. సంపద సృష్టించే ప్రాజెక్టులు ఆపేసి పెట్టుబడులు పెట్టేవారిని తరిమేశాడు. రాష్ట్ర విభజనతో జరిగిన నష్టం కంటే.. జగన్ విధ్వంసకర పాలనలోనే ఎక్కువ నష్టం జరగిందన్నది జగమెరిగిన వాస్తవం. జగన్ రెడ్డి సాగించిన అరాచకం పాలకుల ఎంపిక విషయంలో ప్రజలకు మేలుకొలువు అను కోవచ్చు. బడ్జెట్ పెట్టడానికి వీలు లేనివిధంగా ఆర్థిక పరిస్థితిని దిగజార్చి ఆరు నెలలు తిరక్కుండానే కూటమి ప్రభుత్వంపై తన విషపత్రికతో ప్రతి రోజు విషం చిమ్మడం జగన్ రెడ్డి పైశాచికత్వానికి నిదర్శనం.

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని విధ్వంసం చేసిన జగన్ రెడ్డి పాలసీలు :**

వైసీపీ ప్రభుత్వం చేసిన అవినీతి, అధికార దుర్వినియోగంతో ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ విమర్శల పాలవడమే గాక ప్రభుత్వ ఆదాయాన్ని దెబ్బ తీసింది. గత ఐదేళ్లలో రాష్ట్ర ఖజానాకు రూ.18,860 కోట్ల నష్టం జరిగింది. ఈ రోజుల్లో రోడ్డు పక్క చిన్న బడ్డీ కొట్టులో సైతం డిజిటల్ పేమెంట్ తీసుకుంటుంటే, ప్రభుత్వ మద్యం అమ్మకాలలో మాత్రం ఆన్‌లైన్ లావాదేవీలు లేకుండా కేవలం నగదు రూపంలోనే వసూలు చేసింది తాడేపల్లి ప్యాలస్‌కి తరలించడానికే. ఇసుక పాలసీతో ఇసుకాసురులు సహజ వనరులను దోచుకుని, నిర్మాణ రంగాన్ని పూర్తిగా నాశనం చేయడంతో పాటుగా రాష్ట్ర ఆదాయానికి గండికొట్టారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇసుక పాలసీని కొనసాగించిన తెలంగాణ 2019-24 మధ్య రూ.3,810.12 కోట్లు ఆదాయం పొందితే, అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ఆదాయం కేవలం రూ.1,739 కోట్లు.

| వివిధ విభాగాలలో టీడీపీ ప్రభుత్వ మూలధన వ్యయం, వైసీపీ ప్రభుత్వ మూలధన వ్యయంలో వ్యత్యాసం కోట్లలో | | | | |
|---|---|---|---|---|
| సంఖ్య | విభాగం | 2014-19 | 2019-24 | తేడా |
| 1. | జలవనరులు | 47,838 | 20,752 | 27,086 |
| 2. | ట్రాన్స్పోర్ట్, రోడ్లు, బిల్డింగులు | 8,868 | 1,357 | 7,511 |
| 3. | సాంఘిక సంక్షేమం | 1,045 | 405 | 640 |
| 4. | స్త్రీ, శిశు, సీనియర్ సిటిజన్స్, | 357 | 186 | 171 |
| 5. | ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ | 289 | 0 | 289 |
| 6. | ఇండస్ట్రీస్, కామర్స్ | 1,142 | 965 | 176 |
| 7. | గిరిజన సంక్షేమం | 609 | 229 | 379 |
| 8. | ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్మెంట్ | 732 | 372 | 359 |
| | మొత్తం | 60,879 | 24,267 | 36,612 |

**జగన్ రెడ్డి హయంలో పడిపోయిన రాష్ట్ర రాబడి - భారీగా తగ్గిన మూలధన వ్యయం**

2014-19లో ఏపీ తెలంగాణల మధ్య ఆదాయ వ్యత్యాసం రూ.4,770 కోట్లుగా ఉంటే 2019-24లో జగన్ హయాంలో ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణల మధ్య ఆదాయ వ్యత్యాసం రూ.42,719 కోట్లకు చేరింది. 2019 నుండి 2024 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన లోపభూయిష్ట విధానాలతో రాబడి లేక ఏపీ రూ.18,860.51 కోట్లు నష్టపోయింది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం మూలధన వ్యయం కోసం 59 శాతం ఖర్చు చేస్తే, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం 22 శాతం ఖర్చు చేసింది. వైసీపీ హయాంలో మూలధన వ్యయం 60 శాతం తగ్గింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కేవలం 5 నెలల్లోనే రూ.12,367 కోట్ల జగన్ రెడ్డి ప్రభుత్వ అప్పులను క్లియర్ చేసింది. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పుంజుకుందనడానికి, కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కల్పించడానికి నిదర్శనం.

**2014-2019 మధ్య 2019-2024 ఎనర్జీ సెక్టార్ అప్పులు**

సబ్సిడీ బకాయిలు 31 మే 2019 నాటికి రూ.3,679 కోట్లు ఉండగా గత ఐదేళ్లలో విపరీతంగా పెరిగిపోయి 12 జూన్ 2024 నాటికి రూ.14,580 కోట్లకు చేరాయి. అదేవిధంగా, ప్రభుత్వ శాఖ బకాయిలు దాదాపు మూడు రెట్లు పెరిగి రూ.5,419 కోట్ల నుంచి రూ.15,794 కోట్లకు చేరాయి. డిస్కంలు విద్యుత్ డ్యూటీ అడ్వాన్స్‌లను ప్రభుత్వానికి చెల్లించే విధానం 2019కి ముందు లేదు. విద్యుత్ డ్యూటీ అడ్వాన్స్‌ల కింద డిస్కంలు జగన్ ప్రభుత్వానికి రూ.3,255 కోట్లు చెల్లించినప్పటికీ వైసీపీ ప్రభుత్వ మొత్తం విద్యుత్ రంగ అప్పులు 12 జూన్ 2024 నాటికి రూ.34,267.17 కోట్లు. విద్యుత్ సబ్సిడీని చెల్లించకపోగా డిస్కంలు మార్కెట్ల నుండి అప్పులు తీసుకునే దుస్థితికి దిగజార్చింది జగన్ ప్రభుత్వం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి నవంబర్ 14 వరకు గత ప్రభుత్వం విడుదల చేసిన విద్యుత్ సబ్సిడీ రూ.6,416 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.8,394 కోట్ల విద్యుత్ సబ్సిడీని కూటమి ప్రభుత్వం ఇప్పటికే చెల్లించింది. ఇది గత ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం కంటే రూ.1,977 కోట్లు ఎక్కువ.

**అన్ని శాఖల నిధులనూ దారి మళ్లించిన జగన్ రెడ్డి**

జగన్ రెడ్డి ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం కారణంగా కూటమి ప్రభుత్వంపై రూ.9,74,556 కోట్లు అప్పుల భారం పడింది. ఏడాదికి చల్లించాల్సిన అసలు, వడ్డీ కలిపి 71,881 కోట్లు. ఇవి కాక పెండింగ్ బిల్లులు మరో 1.35 లక్షల కోట్లు. రూ.80,914 కోట్ల పబ్లిక్ ఖాతా అప్పులలో ఉద్యోగుల బకాయిలు రూ.16,771 కోట్లు, సీపీఎస్ రూ.1,307 కోట్లు, స్థానిక సంస్థల నిధులు రూ.11,708 కోట్లు మొదలైనవి ఉన్నాయి. ఈ నిధులకు సంరక్షణగా ఉండాల్సింది పోయి వైసీపీ ప్రభుత్వమే ఈ నిధులను కూడా పక్కదారి పట్టించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఏపీఎస్ఎఫ్ఎస్)ని నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా (ఎన్‌బీఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌డీసీ)ని మరొక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి ప్రోటోకాల్ పాటించకుండా ప్రభుత్వ ఖర్చుల కోసం స్థానిక సంస్థల నిధులను మళ్లించింది. ఏపీ మారిటైమ్ బోర్డ్, స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్, ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మొదలైన 33 వివిధ సంస్థలు, సొసైటీలు, కంపెనీల ఫిక్స్డ్ డిపాజిట్లు, ఇతర సొంత నిధులు మొత్తం రూ.4,738 కోట్లు ఏపీఎస్ఎఫ్ఎస్‌కి మళ్లించారు. దీని వలన ఈ సంస్థలకు నిధులు లేక వీటి కార్యకలాపాలు కుంటుపడ్డాయి.

**పొదుపు మహిళలు, ఉద్యోగుల సొమ్ము మళ్లింపు, ప్రభుత్వ ఆస్తుల తాకట్టు :**

అధిక వడ్డీ రేట్లకు రుణాలు తీసుకోవడమే గాక ఏపీఎస్‌డీసీ ద్వారా అప్పులు

## ఎడిటోరియల్

తీసుకోవడానికి ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి రూ.1,941 కోట్లు బ్యాంకర్లకు గ్యారంటీలుగా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి స్థానిక సంస్థల బ్యాంకు ఖాతాలకు జమ అయిన రూ.3,142 కోట్లు స్థానిక సంస్థలకు ఇవ్వకుండా స్థానిక సంస్థలకు అప్పులు పెట్టింది. అదనంగా, పెండింగ్ విద్యుత్ ఛార్జీల కోసం స్థానిక సంస్థల నిధుల నుండి రూ.2,166 కోట్లు మళ్లించి ఏపీ డిస్కంలకు చెల్లించింది. ఉద్యోగుల సొమ్ముకి సంరక్షణగా ఉండాల్సింది పోయి జగన్ రెడ్డి ప్రభుత్వం తన స్వంత ప్రయోజనాల కోసం ఉద్యోగుల పొదుపు సొమ్ము రూ.5,243 కోట్లు కూడా దారి మళ్లించింది. ఏపీజెన్‌కో/ఏపీటాన్స్‌కో/డిస్కం రూ.3,143 కోట్ల పెన్షన్ అండ్ ప్రావిడెంట్ ఫండ్ సొమ్ము దారి మళ్లించారు. చివరకు డ్వాక్రా మహిళలు పొదుపు చేసుకున్న రోజుకు ఒక్క రూపాయి అభయ హస్తం సొమ్ముని వదలకుండా రూ.2,100 కోట్లు దోచేశారు. అప్పుల కోసం భవిష్యత్ ఆదాయాలను సైతం తాకట్టు పెట్టిన హీన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిది. వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో బిల్లు చెల్లింపుల కోసం 5,000 కోర్టు ధిక్కార కేసులతో సహా దాదాపు 25,000 కేసులు వేయడం రాష్ట్రానికి తీరని అవమానం. జగన్ రెడ్డి నిర్వాకంతో 2024-25 సంవత్సరానికి 1,46,909 కోట్లు లోటులో ఉన్నట్లు తేలింది.

**ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి చర్యలు :**

జగన్ రెడ్డి ప్రభుత్వ అరాచకంతో విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేలా కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్దీ రోజుల్లోనే ఎన్నో అభివృద్ధికర ఆర్థిక విధానాలను రూపొందించింది. గత ప్రభుత్వ అసమర్థ పాలనతో వచ్చిన ఆర్థిక ఇబ్బందుల నుండి కోలుకుని ఆర్థిక వ్యవస్థ తిరిగి పునర్నిర్మితమయ్యేలా 2024-25 బడ్జెట్ రూపొందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి 93 కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన ఎస్ఎన్ఏ ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం నుండి విడుదల చేయాల్సిన బకాయిలు రూ.6078.16 కోట్లు పెండింగ్‌లో ఉంది. 12 జూన్ 2024 నుండి 31 అక్టోబర్ 2024 వరకు, పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ సెక్టార్ స్కీమ్‌ల కోసం కూటమి ప్రభుత్వం రూ.6306.28 కోట్లు విడుదల చేసింది. ఎఫ్‌సీ గ్రాంట్లతో సహా 73 స్కీమ్‌లకు సంబంధించిన కేంద్ర ప్రాయోజిత పథకాలు విడుదల చేయబడ్డాయి. మార్చి 2024 నాటికి పెండింగ్‌లో ఉన్న ఫైనాన్స్ కమీషన్ గ్రాంట్లు రూ.1,000 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది. అంతే కాకుండా స్థానిక సంస్థలకు కూడా రూ.1,000 కోట్లు విడుదల చేసింది. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచి రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడానికి కూటమి ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాలతో ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0, ఏపీ ఎంఎస్ఎంఈ అభివృద్ధి విధానం 4.0, ప్లగ్ అండ్ ప్లేతో ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు కోసం ఏపీ పాలసీ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 వంటి కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకొచ్చింది. ఈ విధానాలతో రాష్ట్రానికి రానున్న 1,82,162 కోట్ల పెట్టుబడులతో 2.63 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. 2047 నాటికి రూ.35 లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టుకుని విధ్వంసం నుంచి వికసితం దిశగా పయనిస్తున్న రాష్ట్రాన్ని చూసి జగన్ రెడ్డి ఓర్వలేక తన పార్టీ పునాది అయిన అబద్ధాలని తన విష పత్రికలో వల్లె వేస్తున్నాడు. ఇకనయినా తీరు మార్చుకోకపోతే జగన్ రెడ్డిని రాష్ట్ర ప్రజలే తరిమి కొడతారు.

సౌజన్య బొర్రా
అనలిస్ట్

## నూతన సంవత్సరం అందరికీ ఆశీర్వాదకరంగా ఉండాలి

**గౌరీపట్నం పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ విక్టర్**



**ఏలూరు, జనవరి 2 (జనస్వరం) :** ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి దేవుని దీవెనలు లభించాలని గౌరీపట్నం పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ విక్టర్ అన్నారు. ఆలయ కాంట్రాక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయంలో సేవలు అందిస్తున్న డైరెక్టర్ ఫాదర్ సహాయ గురువులు సిస్టర్‌లకు సిబ్బందికి దుస్తులు స్వీట్లు పండ్లు అందజేశారు. అనంతరం గౌరీపట్నం పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక అభివృద్ధికి మౌలిక వసతులు కల్పన అభివృద్ధికి భక్తులకు విశిష్ట సేవలు సౌకర్యాలు అందించడంలో కృషి చేస్తున్న డైరెక్టర్ ఫాదర్ జాన్ విక్టర్ ఫాదర్లు ఏసు గిరీష్‌లను కాంట్రాక్టర్ నాగేశ్వరరావు గజమాల పూల మాలలు శాలువా జ్ఞాపిక బొక్కేలతో ఘనంగా సత్కరించారు. తొలుత డైరెక్టర్ ఫాదర్ జాన్ విక్టర్ ప్రార్థనలు నిర్వహించారు.

## అనాధ విద్యార్థులకు అన్నదానం

**- నూతన సంవత్సర వేడుకలను విహాన్ ఛారిటబుల్ ట్రస్టు విద్యార్థుల మధ్య జరుపుకున్న కావూరి లావణ్య**

**- విద్యార్థులతో మమేకమై కలసి భోజనం చేసిన కావూరి లావణ్య**



**ఏలూరు, జనవరి 2 (జనస్వరం) :** తల్లిదండ్రులు లేని విద్యార్థుల పట్ల ప్రతీ ఒక్కరూ ఆదరణ చూపాలని కాంగ్రెస్ నాయకురాలు కావూరి లావణ్య పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి గ్జేవియర్ నగర్‌లోని విహాన్ ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులతో నూతన సంవత్సర వేడుకలను కావూరి లావణ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య విద్యార్థులకు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేసారు. విద్యార్థులతో మమేకమై కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విహాన్ ఛారిటబుల్ ట్రస్టు విద్యార్థులకు అవసరం మేరకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ పట్ల బాధ్యతగా ఉంటే బిడ్డలు అనాథలుగా మారారని, ప్రతీ ఒక్కరూ చెడును విసర్జించి మంచి మార్గంలో పయనించాలని కోరారు. విహాన్ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులను ఆమె అభినందించారు. ట్రస్టు విద్యార్థులు అందరూ మంచి క్రమశిక్షణతో మెలిగి ఉన్నతభ్యాసం చేసి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, అంజి బాబు, టి. సుమన్ బాబు, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పుటేరుపై ఆక్రమణలు తొలగిస్తేనే

# కొల్లేరుకు శాశ్వత పరిష్కారం

**- సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**

**- అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు**



కైకలూరు, జనవరి 2 (జనస్వరం) : నియోజకవర్గంలో తాగునీరు, రోడ్లు, గృహనిర్మాణం, వివిధ శాఖల ప్రగతి, నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన సమస్యలపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణం రాజు, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్‌లు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతాన్ని ముంపు ప్రమాదం నుండి రక్షించేందుకు ఉప్పుటేరుపై ఉన్న ఆక్రమణలను తొలగించి మరింత వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణలదారులకు నోటీసులు జారీ చేసి, ఫిబ్రవరి 1వ తేదీ నుండి ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉప్పుటేరు డ్రైన్ 12 వేల క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యంతో నిర్మించబడిందని, కానీ ఆక్రమణల కారణంగా 6 వేళ క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యానికి తగ్గిపోయిందన్నారు. దీనికారణంగా గత సంవత్సరం బుడమేరుకు వచ్చిన వరదలకు కొల్లేరు ప్రాంతం ముంపునకు గురై ప్రజలు, రైతులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. దీనికి ఉప్పుటేరు డ్రైన్‌పై ఆక్రమణలను తొలగించడమే శాశ్వత పరిష్కారమని, ఈ దిశగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, తాగునీటి సమస్య, పేదలకు గృహ నిర్మాణం వంటి ప్రధాన సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వాటి పరిష్కారాన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా త్రాగునీటి సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. త్రాగునీరు సమస్యలకు సంబంధించి ప్రతీ సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని, నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా పథకాలలో ఫిల్టర్ బెడ్లు మార్చాలన్నారు. మైక్రో ఫిల్టర్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు. నియోజకవర్గంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపి తాగునీరు సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 27 కోట్ల రూపాయలతో 165 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదార్ల పనులకు సంబంధించి 51 పనులు పూర్తి చేశారని, మిగిలిన పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలిదిండిలో రూ.50 లక్షలతో ప్రధాన రహదారిపై వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్లపై గుంతలు పూడ్చే పనులను సంక్రాంతిలోపు పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణ పనులు, మరమ్మత్తు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.18.6 కోట్లతో 25 కిలోమీటర్ల మేర 247 పనులు మంజూరయ్యాయని, వాటిని నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో మంజూరైన 40 అంగన్వాడీ భవనాల నిర్మాణం పనులలో కొన్ని భవనాలు ఫినిషింగ్ పనులు పూర్తి కానీ కారణంగా వినియోగంలోకి రాలేదని, వాటి పనులు వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకోవాలని డ్వామా, పంచాయతీరాజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాలువలు, డ్రైన్లలో తూడు, కిక్కిస, గుర్రపుడెక్క పనులను నిర్దేశించిన సమయంలో చేపట్టి పూర్తిచేయాలని, తొలగించిన తూడు, కిక్కిస, గుర్రపుడెక్కలను కాలువలు, చెరువులు, కాల్వల గట్లపై వేయకుండా దూరంగా వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేదలకోసం నిర్మించిన ఇళ్ల కాలనీలలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రజలు ఆ గృహాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో ప్రధానంగా తాగునీరు, రోడ్లు, గృహనిర్మాణ సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాలువలు, డ్రైన్లలో తూడు, కిక్కిస, గుర్రపుడెక్క తొలగింపు, కాలువలలో డీసిల్టింగ్ పనులను ఏప్రిల్, మే నెల నుండి చేపట్టాలన్నారు. గత సంవత్సరం బుడమేరుకు వచ్చిన వరదల కారణంగా ఏర్పడిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, ఉప్పుటేరు డ్రైన్‌పై ఆక్రమణలు తొలగించి మరింత వెడల్పు చేసే పనులను వెంటనే చేపట్టాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వ సమయంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.28 కోట్లతో భూములను కొనుగోలు చేసారని, రూ.26 కోట్లను ఆ భూములను మెరక చేసేందుకు ఖర్చు చేసారని, ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుల వాటాతో కలిపి దాదాపు రూ.80 కోట్లలతో ఏర్పాటుచేసిన కాలనీలు మౌలిక సదుపాయాలు లేక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. సంబంధిత అధికారుల బృందంతో కమిటీని నియమించి కాలనీలను పరిశీలించి క్షేత్రస్థాయిలో సమస్యలు అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి తీసుకోవాలని చర్యలపై నివేదిక రూపొందించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో వేలాది ఎకరాలలో భూ సమస్యలు ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు తమ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేసి, ప్రజల నుండి వారి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూ, పంచాయతీ రాజ్ ఎస్ఈలు జాన్ మోషే, త్రినాథ్ బాబు, రమణమూర్తి, డ్వామా పీడీ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు భలే యేసు రాజు, కొల్లి బాబి, పూల రాజీ, బూరుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# దొంగలను పట్టుకున్న భైంసా పోలీస్





- కొత్త సంవత్సరం రోజూ మద్యం తాగడానికి కోసం దొంగతనం
- దొంగలు చుచుంద్ గ్రామానికి చెందిన వాళ్ళు అని పోలీస్ వారు గుర్తించారు.
- 48 గంటల వ్యవధిలో దొంగలను పట్టుకున్న భైంసా పోలీసులు.
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిలా

**భైంసా, జనవరి 2 (జనస్వరం) :** పట్టణంలోని నాందేడ్ వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న నాగదేవత ఆలయంలో చోరికి పాల్పడిన దొంగలను భైంసా పోలీస్ 48 గంటల వ్యవధిలో పట్టుకున్నమని ఏఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేలేకరుల సమావేశంలో జిల్లా పోలీస్ అధికారి జానకి షర్మిల పేర్కొన్నారు.భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ పాటు పట్టణ సీఐ గోపినాథ్ కలసి రాత్రి పగలు తేడాలేకుండా కష్టపడి దొంగలను పట్టుకున్నారని సూచించారు. మండలంలోని చుచుంద్ గ్రామానికి చెందిన విశాల్, సంఘరతన్, ఇద్దరు స్నేహితులు అని నూతన సంవత్సర వేడుకలను నిర్వహించేందుకు డబ్బులు లేకపోవడంతో దొంగతనం చేయాలని నిర్ణయం తీసుకున్నారని, నాగదేవత ఆలయానికి వెళ్లి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. హుండీ పాటు కానుకలు గంటలు తీసుకుపోయారని దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో వారు ధరించిన దుస్తులకు పసుపు కుంకుమ అంటుకోవడంతో పోలీసులు ఉదయం 4 గంటల నుండి 6 గంటల లోపల పట్టణంలోని ప్రవేశ మార్గంలోని ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించడంతో ఇద్దరిలో ఒకరికి పసుపు, కుంకుమ అంటినట్లుగా గుర్తించి అనుమానంగా భావించారని దర్యాప్తు నిర్వహించి దొంగాలు అని నిర్ధారించారు. అనంతరం రిమాండ్‌కు పంపిస్తునట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం ఏఎస్పీ అవినాష్ కుమార్ పాటు సీఐ గోపీనాథ్, కానిస్టేబుల్ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

## రుచికరమైన ఆహారం అందించండి

ఎంఈఓ మస్తాన్వలి



**సీతారాంపురం, జనవరి 2 (జనస్వరం) :** డొక్కా సీతమ్మ గోరుముద్దులో భాగంగా విద్యార్థులకు ఆహారాన్ని అందించే మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులు విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని మండల ఎంఈఓ ఎస్కే మస్తాన్వలి తెలిపారు. గురువారం ఓవరు వాండ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. భోజనానికి ముందు విద్యార్థులు ఆహారం తీసుకునే ప్రాంతాన్ని శుభ్ర పరచాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల చేత హ్యాండ్ వాష్ చేయించిన తర్వాతనే భోజనం అందించాలని తెలిపారు. ప్రతిరోజు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరొక ఉపాధ్యాయుడు భోజనం తయారు చేసే విధానాన్ని పరిశీలించాలని, భోజనం తయారీలో వాడుతున్న పదార్థాలను, కూరగాయల నాణ్యతను, కొలతలను, పరిశీలించాలని తెలిపారు. ప్రతిరోజు భోజనం ముగిసిన తర్వాత ఒక విద్యార్థి చేత ఆహారంలోని లోపాలను టెస్టింగ్ ద్వారా గుర్తించాలని తెలిపారు. ప్రతిరోజు ఒక ఉపాధ్యాయుడు వండిన ఆహారాన్ని రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు అందించాలని తెలిపారు. పరిశుభ్రమైన మంచినీరు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిగే కొండయ్య, సిఆర్పి వెంకటేశ్వర్లు, భాస్కర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రులు, పలువురు ప్రముఖులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య





**చీరాల, జనవరి 2 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్‌ని, రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, రోడ్లు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులను ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## బైక్ రేసింగ్ చేస్తూ పట్టుబడ్డ నలుగురు యువకులు, 3 బైకులు సీజ్...

డిఎస్పీ ఆధ్వర్యంలో పిల్లలకు వారి తల్లితండ్రులకు ప్రత్యేక కౌన్సిలింగ్...



**కదిరి, జనవరి 2 (జనస్వరం) :** గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో కదిరి శివారులోని హిందూపూర్ రోడ్ నుండి అనంతపురం రోడ్ వరకు కొత్తగా నిర్మిస్తున్న కదిరి ఔటర్ రింగ్ రోడ్‌లో సుమారు 10 మంది యువకులు అతివేగంగా, నిర్లక్ష్యంగా బైక్ రేసింగ్ చేస్తూ ఉండగా, పోలీస్ సిబ్బంది రైడ్ చేసి బైక్ రేసింగ్ చేస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 3 బైకులను స్వాదీనం చేసుకున్నారు. కొంత మంది యువకులు పారిపోయారని సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్టుబడ్డ నలుగురు యువకులు వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి డిఎస్పీ శివ నారాయణ స్వామి వారికి తగిన కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత వారిని వారి తల్లిదండ్రులతో పాటు కదిరి మండల తహసిల్దార్ వద్ద బైండ్ ఓవర్ చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా సీజ్ చేసిన 3 రేస్ బైకులను కదిరి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌కు తదుపరి చర్య నిమిత్తం పంపారు. పారిపోయిన మిగిలిన బైక్ రేసర్లు గురించి ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.

## మంత్రి నిమ్మల రామానాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు





**పాలకొల్లు, జనవరి 2 (జనస్వరం) :** రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును గురువారం అమరావతి సచివాలయంలో పలువురు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసారు. నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, రుడా చైర్మన్ వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్దన్, నాగార్జునసాగర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఏలూరు గోపాలరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఉన్నారు.

## ఏబీఆర్ఎస్ఎం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ




**విజయవాడ, జనవరి 2 (జనస్వరం) :** అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహా సంఘం (ఏబీఆర్ ఎస్ఎం) 2025 క్యాలెండర్‌ను ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్య సంచాలకులు డాక్టర్ నారాయణ భరత్ గుప్తా గురువారం కమిషనర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.ఎస్.వి.ఎస్. బాలసుబ్రమణ్యం, డిగ్రీ కళాశాల విభాగం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ కె. బాలకృష్ణ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో పనిచేస్తున్న అర్హతగల అధ్యాపకులకు యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ (యూజీసీ) నియమాల ప్రకారం కెరీర్ అడ్వాన్స్ స్కీమ్ కింద పదోన్నతుల నోటిఫికేషన్ జారీ చేయాలని, 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా విధులకు హాజరైన ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ఉత్తరాలు ఇవ్వాలని ఏబీఆర్ఎస్ ప్రతినిధులు కళాశాల విద్యా విభాగం సంచాలకుల ద్వారా కోరారు. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్య సంచాలకులు గారు, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## 58 ఏళ్ల వ్యక్తిపై విజయవంతంగా సంక్లిష్టమైన మైక్రో వాస్క్యులర్ సర్జరీ




**హైదరాబాద్, జనవరి 2 (జనస్వరం) :** నిజామాబాద్ జిల్లా గుత్ప గ్రామానికి చెందిన 58 ఏళ్ల గుమ్మల సాయన్నకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్, విద్యానగర్ వైద్యులు విజయవంతంగా మైక్రో వాస్క్యులర్ సర్జరీ నిర్వహించారు. గత ఏడాది నుంచి ముఖంలో వాపు, కుడి దవడ దగ్గర పెద్ద కణితితో (10 సెంటీమీటర్లు) బాధపడుతున్న సాయన్నకు మాక్సిల్లరీ సైనస్ కార్సినోమా అనే వ్యాధి నిర్ధారణ కావడంతో శస్త్రచికిత్స తప్పనిసరి అయ్యింది. తొలుత ఇతర ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చులు ఎక్కువగా చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్‌ను సంప్రదించారు. వారి కేసును పరిశీలించిన డా. యు.ఆజాద్ చంద్రశేఖర్, మెడికల్ డైరెక్టర్ అండ్ సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్టు, ఈ కేసును సవాల్‌గా తీసుకొని సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. పేషెంట్ పరిస్థితిని ట్రూ కట్ బయాప్సీ, సిటీ స్కాన్, హెూల్ బాడీ పెట్-సీటీ స్కాన్‌ల ద్వారా విశ్లేషించిన వైద్యులు, రాడికల్ మాక్సిలెక్టమీ, ఫ్రీ అంటిరోలటరల్ థై ఫ్లాప్, ఫ్రీ ఫ్లాప్ రికన్స్ట్రక్షన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలతో సర్జరీ పూర్తి చేశారు. ఇది 10-12 గంటల పాటు కొనసాగింది. మీడియా సమావేశంలో డా. యు. ఆజాద్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ సర్జరీ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రి 40 ఏళ్ల చరిత్రలోనే అత్యంత క్లిష్టమైనదని తెలిపారు. పేషెంట్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకుని తక్కువ ఖర్చుతో చికిత్స అందించారని చెప్పారు. ఈ విజయానికి వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది సహకారమే కారణమని ధన్యవాదాలు తెలిపారు. సాయన్న కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, డా. ఆజాద్ చంద్రశేఖర్‌తో పాటు మొత్తం వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. వారి నైపుణ్యం, నిబద్ధత వల్లే తమ కుటుంబానికి ఆశలు చిగురించాయని పేర్కొన్నారు. సర్జరీ అనంతరం కేవలం వారం రోజుల్లోనే పేషెంట్ పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఈ విజయంతో, అత్యంత ఆధునిక సాంకేతికతతో సామాన్యులకు కూడా అత్యుత్తమ వైద్యం అందించగలమనే నమ్మకాన్ని ఆసుపత్రి మరింతగా బలోపేతం చేసింది.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేన్ని పరిశీలించిన సీఎన్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 2 (జనస్వరం) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం యూసఫ్ గూడా జీహెచ్ఎంసీ సర్కిల్ -19 కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ జకీయ సుల్తానా, అధికారులతో సమావేశమైయ్యారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆదేశించారు. సర్వే పారదర్శకంగా కొనసాగాలని ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి లబ్ది చేకూర్చాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకీయ సుల్తానా ఇంకా సిబంది సిబ్బంది, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



**బొంరాస్‌పేట, జనవరి 2 (జనస్వరం) :** మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో గురువారం పీఆర్టీయూ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముఖ్యఅతిథిగా వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శేరి రాజేష్ రెడ్డి, మండల విద్యాధికారి హారిలాల్, పీఏసీఎస్ అధ్యక్షులు జయకృష్ణ హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చౌదర్పల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, టీఆర్టీయూ మండల అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి శశిధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర రెడ్డి, పీఆర్టీయూ మండల కమిటీ సభ్యులు కాశిపతి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం మెట్ల కుంట శ్రీహరి. లింగానపల్లి హెచ్ఎం వెంకటయ్య, పీఆర్టీయూ కార్యదర్శి దీప్లనాయక్ తండా. వినరాణి మేడు చెట్టు తండా తదిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**తాండూర్, జనవరి 2 (జనస్వరం) :** స్థానిక ఆర్డీవో కార్యాలయంలో తాపస్ 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమైందని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీ కాంతారావు. నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం. మీడియా ఇంచార్జ్ బస్వరాజ్. బషీరాబాద్, యాలాల్, పెద్దెముల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వినోద్ కుమార్, రవికుమార్, రాజేష్, సంతోష్ కుమార్, వీరేశం, ప్రదీప్ జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్, అనిల్, బాలకృష్ణ, శ్రీనివాస్, మణిక్రవ్, నరహరెడ్డి, కొత్త శ్రీనివాస్, మురళి, సిద్ధమేశ్వర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'కొమ్ముల' కుటుంబ సభ్యులను పరామర్శించిన నరసాపురం ఎమ్మెల్యే



**పాలకొల్లు, జనవరి 2 (జనస్వరం) :** పాలకొల్లు నియోజకవర్గం పాలకొల్లు పట్టణానికి చెందిన, విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ మాతృమూర్తి, కొమ్ముల సత్యవతి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం, కుమారుడు కొమ్ముల మురళీకృష్ణను, వారి కుటు ంబ సభ్యులను, ప్రభుత్వ విప్, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ స్వయంగా పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## ప్రతి వేడుక... పేదలకు పండుగ కావాలి

**పేదలకు దుప్పట్లు - విద్యార్థులకు యూనిఫాం పంపిణీ**



**కైకలూరు, జనవరి 2 (జనస్వరం) :** ప్రతి వేడుక.. పేదలకు పండుగగా మారాలని టీడీపీ నాయకులు, బీఎస్ఆర్ ఆక్వాట్రేడర్స్ అధినేత, దినేష్ ఇన్ఫ్రా మేనేజింగ్ పార్టనర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు (బీఎస్ఆర్) ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండవల్లి మండలం లోకుమూడి గ్రామంలోని బిఎస్ఆర్ ఆక్వా ట్రేడర్స్ వద్ద బూరుబోయిన శ్రీనివాసరావు (బిఎస్ఆర్) అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా వెలమపేటలో ఎయిమ్ ఫర్ సేవా స్వామి దయానంద సేవా ఆశ్రమంలో సుమారు 25 మంది విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా బీఎస్సార్ ఆక్వాట్రేడర్స్ వద్ద సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వేడుక పేదలకు పండుగగా మారాలని, దానిలో భాగంగానే ప్రతి చిన్న కార్యక్రమానికి పేదలకు తన వంతు సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మోడీ చిత్రపటానికి పాలాభిషేకం




**ఓడిచెరువు, జనవరి 2 (జనస్వరం) :** మండలంలోని బీజేపీ అధ్యక్షులు వీరాంజనేయులు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ రైతు సమస్యల గురించి తెలుసుకొని రైతుల పడుతున్నటువంటి ఆర్థిక పరిస్థితులను గుర్తించి పీఎం కిసాన్ రూ.6 వేలు నుంచి రూ.10వేలకు పెంచారు. ఈ శుభ సందర్భంగా గురువారం ఒడిసి అంబేద్కర్ సర్కిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ చిత్రపటానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ స్టేట్ ఆర్గానిక్ కన్వీనర్ చింత శరత్ కుమార్ రెడ్డి అధ్యక్షులు వీరాంజనేయులు, అశ్వితప్ప జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల వెంకట రమణ, మాజీ అధ్యక్షులు సున్నంపల్లి రంగారెడ్డి, నీలకంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వేమారెడ్డి పల్లి కూటమి నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షులు, అసెంబ్లీ కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప సభ



**హిందూపురం, జనవరి 2 (జనస్వరం) :** స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సత్యసాయి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఎం.యచ్.ఇనాయతుల్లా, హిందూపురం అసెంబ్లీ కోఆర్డినేటర్ యంఇకిఫాయతుల్లా ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప సభను నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అమరహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనాయతుల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున భారతదేశ ప్రజలకు సేవలు అందించిన ఘనత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కి దక్కిందని కొనియాడారు. ఆయన పదవీ కాలంలో అనేక ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టి దేశాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) క్యాలెండర్ ఆవిష్కరణ



**కూనవరం జనవరి 2 (జనస్వరం) :** స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం కూనవరం నందు ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) క్యాలెండర్‌ను, స్టిక్కర్ క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారులు అయిన వివి లక్ష్మినారాయణ, తుర్రం లక్ష్మయ్యలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పాఠశాలలను అందరు గ్రామస్తులు ఎస్ఎంసీ సహకారంతో ఏజెన్సీ ప్రాంతం విద్యాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉపాధ్యాయుల కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి ఆటా (ఏటీఏ) జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ సరియం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ అనేది యూనియన్ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ట్రైబల్ టీచర్స్ కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు చేసి వారికి రావాల్సిన ఉద్యోగ ఉపాధి నియామకాలు ప్రమోషన్లు వారికి అందేలా చేయడం జరిగిందని తెలియపరిచారు. త్వరలో ప్రకటించే డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంతాలలో 100 శాతం ఏజెన్సీ ప్రాంత ట్రైబల్ అభ్యర్థులతోనే చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20 ఉండేలా పోస్టులు ప్రకటించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో బౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేనందున ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసే విధంగా ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చట్టం వీరయ్య మండల అధ్యక్షులు జితేంద్ర మహిళా కార్యదర్శులు సోడే దుర్గ, పాయల భవాని, సోడే జయమ్మ, మడకం సుజాత కుంజ జితేంద్ర, బొడ్డు శ్రీను, కుంజా సత్యనారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 5న పులివెందులలో హాకీ పోటీల ఎంపిక

**పులివెందుల, జనవరి 2 (జనస్వరం) :** వైఎస్ఆర్ కడప జిల్లా బాలుర జూనియర్, సబ్ జూనియర్ హాకీ జట్ల ఎంపికలు ఈ నెల 5న వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో ఉదయం 9 గంటల నుండి జరుగనున్నట్లు హాకీ కడప జిల్లా సెక్రటరీ ఏం.శేఖర్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు ఈ నెల జనవరి 17 నుండి 19 వరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మదనపల్లిలో జరగే 14వ రాష్ట్రస్థాయి బాలుర సబ్ జూనియర్ చాంపియన్షిప్‌లో పాల్గొంటారన్నారు. ఈ ఎంపిక హాజరు అయ్యే క్రీడాకారులు కచ్చితంగా 01-01-2009 తేది తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో ఎంపికైన బాలుర జట్టు ఈ నెల 2వ వారంలో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర చాంపియన్షిప్‌లో పాల్గొంటారని, ఇందులో పాల్గొనే క్రీడాకారులు కచ్చితంతగా 01-01-2006 తేది తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే జూనియర్, సబ్ జూనియర్ క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికేట్‌లను తీసుకొని ఈ నెల 5వ తేది ఉదయం 9:00కి పట్టణంలోని స్పోర్ట్స్ అకాడమీలో పులివెందుల హాకీ కోచ్ రవికి రిపోర్ట్ చేయాలని తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నూతన ఏడాదిలో ప్రజల రక్షణకు కొత్తగా పోలీస్ మార్క్ కనిపించాలి

- న్యాయం కోసం వచ్చిన ప్రజల పక్షాన పోలీసులే న్యాయ నిర్ణేతలుగా మారాలి
- ప్రజలు ప్రశాంత వాతావరణం గడిపేలా పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరించాలి
- మీకు మీ కుటుంబ సభ్యులకు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు..
- పుట్టపర్తి నియోజవర్గ పోలీసులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడి



**పుట్టపర్తి, జనవరి 2 (జనస్వరం) :** 2025 నూతన సంవత్సరంలో న్యాయం కోసం వచ్చిన ప్రజల పక్షాన పోలీసులే న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. ఈ నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా అనంతపురం శివారు ప్రాంతంలోని పల్లెనివాసంలో ఉన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిని సత్యసాయి జిల్లా అదనపు ఎస్పీ అర్ల శ్రీనివాసులతోపాటు పుట్టపర్తి నియోజకవర్గ సబ్ డివిజన్ డీఎస్పీ విజయకుమార్‌తో పాటు సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, ప్రభుత్వ అధికారులు, నియోజకవర్గ ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లె కుటుంబ సభ్యులకు మొక్కలు బహుమతిగా అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడే ఉన్న కేరళ మాజీ డిజిపి శంకర్ రెడ్డిని సత్యసాయి జిల్లా, పుట్టపర్తి పోలీసులు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ప్రశాంత వాతావరణం గడిపేలా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజలకు న్యాయం జరిగేలా పోలీసులే న్యాయ నిర్ణేతలు కావాలని సూచించారు. న్యాయం, ధర్మం వైపు పోలీస్ వ్యవస్థ నిలబడాలని, అప్పుడే ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై పూర్తి విశ్వాసం, నమ్మకం గౌరవం పెరుగుతుందని తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో పుట్టపర్తి నియోజకవర్గంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించి నేరాలు జరగకుండా చూడాలని కోరారు. పుట్టపర్తి ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమని ఈ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అత్యంత పగడ్బందీగా రక్షణ ఏర్పాట్లు చేసేలా పోలీస్ వ్యవస్థ పటిష్టంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇకపై పోలీసులలో కొత్త మార్పు కనిపించాలని అందుకు అవసరమైన సహాయ సహకారాలు తమ నుంచే కాక ప్రభుత్వం నుంచి పోలీస్ శాఖకు ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థను అన్ని విధాలుగా భ్రష్టు పట్టించారని ఈ కూటమి ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థకు గౌరవం పెంచేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పోలీస్ అధికారులకు స్వేచ్ఛను ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవని పోలీసులు అత్యంత పారదర్శకంగా నిజాయితీగా ప్రజలకు న్యాయ సేవలు అందించాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉందంటే సీఎం చంద్రబాబు పాలనే నిదర్శనమన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా పోలీసులు ప్రజల పక్షాన న్యాయం కోసం పనిచేయాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉండడం వల్లే ప్రస్తుతం నేరాల రేటు తగ్గడానికి కారణమన్నారు. అనంతరం నియోజకవర్గం నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు టీడీపీ, బీజేపీ, జనసేన కుటుంబ సభ్యులు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, పల్లె అభిమానులు తదితరులు పల్లె నివాసానికి తరలివచ్చి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు పల్లె కృష్ణ కిషోర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బాలసదనంలో దుప్పట్లు, పెన్సిళ్లు పంపిణీ



**దెందులూరు, జనవరి 2 (జనస్వరం) :** తల్లిదండ్రులు లేకపోతేనో, బంధువులు లేకపోతేనో అనాధలు కారని డబ్బు ఉండి కూడా నలుగురికి సాయం, సేవ చేయలనే మంచి మనసు లేని వారు మాత్రమే నిజమైన పేదవారు, అనాధలని చల్ల చింతలపూడి గ్రామానికి చెందిన జై గౌడ సేన రాష్ట్ర నాయకులు, స్థానిక అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నూతి రవీందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో ఉన్న చిన్నారి పిల్లలను బాలసదనం సూపరింటెండెంట్ ఎస్ బేబి సరోజినీ, అకౌంటెంట్ దుర్గా మల్లేశ్వరిలతో కలిసి బాలసదనం హాస్టల్లో ఉండే చిన్నారులకు దుప్పట్లు, పెన్సిల్లను నూతి రవీందర్ గౌడ్ అందజేశారు. అనంతరం బాలసదనంలో ఉన్న చిన్నారులు జె సిరి.గోపికల జన్మదినం సందర్భంగా భారీ కేక్ కట్ చేసి నూతి రవీంద్ర గౌడ్ చిన్నారులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జై గౌడ సేన సంఘం నాయకులు బోప్పన పుర్ణచంద్రారావు ఉన్నారు.

## పింఛనుదారులకు అనువుగా పింఛన్ల పంపిణీ

**స్పౌజ్ కేటగిరీ పింఛన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట, జనవరి 2 (జనస్వరం) :** పింఛనుదారులకు అనువుగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్పౌజ్ కేటగిరీ చెందిన కోరుమిల్లి రాజేశ్వరి, కింతాడ పార్వతి, ముగ్గ ముత్యాలమ్మ, దురుపూడి రత్నం తదితరులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంలో భాగంగా సామాజిక భద్రత పింఛన్లు ఎక్కువమందికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టి, పింఛన్ల పంపిణీలో స్పౌజ్ కేటగిరీ తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోయిన వెంటనే భార్యకు ఏ నెలకు ఆ నెలే పింఛను మంజూరు చేయాలనే స్పౌజ్ కేటగిరీ విధానాన్ని ప్రజా ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ కేటగిరీలో జగ్గంపేట టౌన్‌కు 4 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. శ్రీకాకుళం పర్యటనలో భాగంగా నవంబర్ నెలలో ఈ మేరకు సీఎం చంద్రబాబు ప్రకటించిన విధంగా స్పౌంజ్ కేటగిరీ డిసెంబరు నెల నుండే అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. నవంబరు 1 తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకూ స్పౌజ్ కేటగిరీలో రాష్ట్రంలో 5402 మంది వితంతువులకు రూ.4 వేల చొప్పున పింఛను అందించినట్లు తెలిపారు. అంతేకాకుండా వివిధ కారణాలతో మూడు నెలల కాలంలో రాష్ట్రంలో పింఛన్లు తీసుకోలేని వారికి మూడు, రెండు నెలల మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు ఒక్కరోజు ముందుగానే లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, జీను మణిబాబు, బీజేపీ జగ్గంపేట ఇంచార్జ్ దాట్ల కృష్ణ వర్మ, బచ్చుల సుధీర్, పంచాయతీ కార్యదర్శి రాజన్ రాజు, సత్యం రాజా, పంచాయతీ సిబ్బంది సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం



**పులివెందుల, డిసెంబర్ 2 (జనస్వరం) :** పట్టణం కొత్త బస్టాండ్ పక్కన హౌసింగ్ కాలనీకి వెళ్లే 100 అడుగుల రోడ్ సమీపంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణంలో భాగంగా నీటి వసతి కొరకు బోరు బావి వేయించారు. ఇందులో 240 అడుగుల మేర బోర్ వేయడంతో దాదాపు 2.5 అంగుళాల మేర నీళ్లు పడినట్టు స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో నీటి ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని ముందుగా బోరు వేయించామని, తదుపరి పనులు ప్రారంభించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఏ సందర్భంలో అయినా భవన నిర్మాణంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు 9966509364కి సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు నాగేంద్ర, పద్మనాభయ్య, మహమ్మద్ రఫీ, రాజశేఖర్ గుప్తా, రవి కుమార్, ప్రతాప్, రాజా, బండారు రాజు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల నుండి ఆలోచనలు ఉత్పన్నమవుతాయి

**ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్‌కు నాలుగు ఉత్తమ జట్లు ఎంపిక**



**నంద్యాల, జనవరి 2 (జనస్వరం) :** సమస్యల నుంచి ఆలోచనలు ఉత్పన్నమవుతాయని వీటిని ఎలా నివారించాలనే కార్యక్రమంతో ఎస్ఆర్కేడిసి ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ కార్యక్రమంలో విజయం సాధించిన నాలుగు జట్ల విద్యార్థుల బృందాన్ని శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డిలు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ నిర్వహించిన 8.0లో మండించడానికి ఎంపికైన నాలుగు జట్లు ఎంపిక కావటం గర్వకారణమన్నారు. విద్యార్థులు మూడు రౌండ్ల ద్వారా వెళ్ళిన ఆచరణాత్మక, అద్భుతమైన ఆలోచనతో ముందుకు వచ్చారన్నారు. ఇగ్నైట్ 8.0 కోసం ఎంపికయ్యారన్నారు. ఇది మనం సాధించిన గొప్ప మైలురాయన్నారు. ఎంపిక చేసిన నాలుగు ఆలోచనలు సిధార్థ, జట్టు ఆలోచన గట్టి అనే అంశం జట్టు సభ్యులైన సిధార్థ, పవన్ కళ్యాణ్, జెశ్వంత్ సుకన్య, శిరీష సుమలత ప్రదీప్ రాయల్, శివ కుమార్‌లు ఉన్నారు. బీసీఏ రెండో సంవత్సరం నుంచి, బీబీఏ రెండో సంవత్సరం నుండి మీథో యాప్‌ను అభివృద్ధి చేసిన న్యాసా పవన్ బృందం జట్టు సభ్యులైన సుప్రజా బృందం, బి కామ్ రెం సంవత్సరం నుండి వైద్య అత్యవసర పరిస్థితుల కోసం డ్రోన్ డెలివరీని రూపొందించిన జట్టు సభ్యులైన సుప్రజ వసుధ సుప్రియ అజయ్ లోకేష్‌లు ఉన్నారు. బీసీఏ రెండవ సంవత్సరం నుండి తినదగిన, పర్యావరణ అనుకూల కప్పుల ఆలోచనను రూపొందించిన జట్టు సభ్యులు రమ్య, ప్రియాంక, శిరీష, శ్రావణి సుమాంజలిలు ఉన్నారు. ఈ కార్యక్రమాలకు కళాశాల యాజమాన్యం తమకు మద్దతు ఇచ్చిందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎం. ఎం.శ్రావణి కుమారి, పి.సాదిక్‌లు పాల్గొన్నారు.

## భూకబ్జా దారులను కట్టడి చేయడంలో అధికారులు విఫలం



**నంద్యాల, జనవరి 2 (జనస్వరం) :** పట్టణంలో వైఎస్సార్ నగర్, నందమూరి నగర్‌లో భూకబ్జా దారులను కట్టడి చేయడంలో ప్రభుత్వ పెద్దలు. మున్సిపల్ అధికారులు. విఫలమైయ్యారని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణ శివారులో ఉన్న నగరలలో ఆయన పర్యటించారు. పట్టణ శివారు ప్రాంతాలైన నందమూరి నగర్, వైఎస్సార్ నగర్‌లో ఉన్న ఖాళీ స్థలాలను కబ్జా చేస్తున్న వారి పట్ల ప్రభుత్వ పెద్దలు మున్సిపల్ కమిషనర్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ నగర్‌లు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న ఇప్పటికీ అక్కడ ఖాళీ స్థలాలు ఉన్నయ న్నారు. ఆ స్థలాలను కంప చెట్లతో అడవిని తలపించే విధంగా ఉన్నాయని, ఆ స్థలాల కోసం కబ్జా కోర్లు పోటీపడి ఒక ప్లాట్ మీద రెండు లేదా మూడు పట్టాలు పుట్టిస్తూ దౌర్జన్యాలకు పూనుకుంటు న్నారని ఆరోపించారు. గతంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి పేదల కోసం ఇచ్చిన ఇంటి స్థలాలను ఎందుకు ఖాళీగా ఉన్నాయని పరిశీలన చేసి కొన్ని ప్లాట్లను గుర్తించి పేదలకు అందజేశారు. ఇప్పుడు వైఎస్సార్ నగర్‌లో ఎల్‌పి నెంబరు 3, 4 ఎల్‌పి నెంబర్ 2 బ్లాక్ ఎల్‌పి నెంబర్1 ఎల్‌పి నెంబర్ 5 ట్రైలర్ కాలనీ ఇలా అన్ని ఏరియాలలో ప్లాట్లు కబ్జాలకు గురవుతున్నావని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు మున్సిపల్ అధికారులు పరిశీలన చేసి ఆ ఖాళీ స్థలాలకు ఎవరు యజమానులుగా లేరని తెలిస్తే పట్టణంలో అనేకమంది ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారని, వారికి ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి నగర్ సీపీఐ శాఖ కార్యదర్శి భాష మబ్బులు రఫీ తదితరులు పాల్గొన్నారు.

## పోతునూరులో భూ సమస్యలపై రెవెన్యూ గ్రామ సభ



**దెందులూరు, జనవరి 2 (జనస్వరం) :** భూమికి సంబంధించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరక్కుండా అధికారులే గ్రామాల్లోకి రైతులు ఇళ్లకు వచ్చి రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ బత్తుల సుమతి తెలిపారు. గురువారం మండలంలోని పోతునూరు గ్రామంలో గ్రామ సచివాలయం కార్యాలయం వద్ద రెవిన్యూ సదస్సును నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జ్ బొడ్డేటి మోహన్ బాబు, మండల పార్టీ బీసీ సెల్ అధ్య క్షులు పోతునూరు గ్రామ పార్టీ కార్యదర్శి నున్న లక్ష్మణ్, సాగునుడి వినియోగదారుల సంఘం అధ్యక్షులు చలసాని రాంబాబు, బాయి రాంప్రసాద్ తదితరులు నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ నానితో పాటు గ్రామ రెవెన్యూ అధికారి రామచంద్రరావు, రైతులు ఉన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించండి

**సమీక్ష సమావేశంలో అధికారులకు సూచించిన**

**జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్**

**పుట్టపర్తి, జనవరి 2 (జనస్వరం) :** దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి రూ.15వేలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణ బాబు, సెర్ప్ సీఈవో వీర పాండ్యన్ తెలిపారు. రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. వీక్షణ సమావేశానికి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా పింఛన్లు పొందే వారిని తొలగించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని కృష్ణ బాబు తెలిపారు. అందులో భాగంగా పరిశీలన చేపడు తున్నామన్నారు. ఇందుకోసం వైద్య బృందాలను నియమిస్తామన్నారు. సధరమ్ ద్వారా జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. పరిశీలన కొరకు ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు, ట్యాంపరింగ్ వంటి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకంగా నియమించిన వైద్య బృందాలకు సహాయ సహకారాలు అందించడానికి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. వారి ద్వారా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారించాలన్నారు. అనర్హులుంటే వారి వివరాలను సంబంధిత వైద్యాధికారులు తక్షణమే యాప్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యుల ధ్రువీకరణతో ధ్రువీకరణ పత్రాలు సైతం రద్దు అవుతాయన్నారు. సోమవారం నుంచి విచారణ ప్రక్రియ ప్రారంభించాలని, విచారణకు సంబంధించిన మార్గదర్శకాలు పంపుతామన్నారు. నూరు శాతం నిక్కచ్చిగా పరిశీలన, విచారణ ప్రక్రియ జరుగుతుందన్నారు. బృందాలను పర్యవేక్షించుకోవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. విచారణపై పలు సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 1715 మంది దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన కేటగిరిలో రూ.15వేలు చొప్పున ప్రతి నెల పింఛన్ పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు విచారణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వైద్య బృందాల పరిశీలన కొరకు సూక్ష్మ ప్రణాళిక, రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయుచున్నామని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, డీఆర్డీఏ పిడి కన్వీనర్‌గా గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ సూపర్డెంట్ మెంబర్గా, డిఎంహెచ్వో, డిసి హెచ్ఓ, జిల్లా లెప్రసీ ఆఫీసర్, డిపిఓ, జడ్పీ డిప్యూటీ సీఈవో, గ్రామ వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్, మున్సిపాలిటీ కమిషనర్లు, పోలీస్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు మెంబర్లుగా ఉంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్యుడు రోగి వైకాల్యాన్ని అంచనా వేస్తాడని తెలిపారు. గ్రామ వార్డ్ సచివాలయ వారిగా నివేదిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట సుబ్బయ్య, డిఆర్డిఏ పిడి నరసయ్య, డిఎంఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం, డిసిహెచ్ఓ తిపేంద్ర నాయక్, డిపిఓ సమత, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ, జీఓల పుస్తకాల ఆవిష్కరణ




**అమడగూరు, జనవరి 2 (జనస్వరం) :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం విద్యాశాఖాధికారి జీలాన్ బాషా చేతుల మీదుగా ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ, జీవో పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూలకుంటపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు రంగయ్య, తుమ్మల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, చినగానిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.నారాయణ,స్టేట్ కౌన్సిలర్ ఎక్స్ తలమర్ల నరసింహులు, శ్రీనివాసులు, ఇమామ్ సాబ్, ధనుంజయ, హరి, వెంకట రాముడు, రంగనాయకులు, రఫీ ఈశ్వర్, మోహన్ బాబు, తదితర ఉపాధ్యాయ బృందం, మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త ఏడాదిలో మరింత ఉత్సాహంతో పనిచేసి.. ప్రజలకు మెరుగైన సేవలందించాలి

**జిల్లా ఎస్పీ వి.రత్న**



**పుట్టపర్తి, జనవరి 2 (జనస్వరం) :** కొత్త ఏడాదిలో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత ఉత్సాహం తో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు జిల్లా పోలీస్ అన్ని శాఖల సిబ్బంది జిల్లా ఎస్పీ వి.రత్నని కలిసి పూల బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం పోలీస్ అధికారుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ ఎస్పీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ సూచించారు. కొత్త ఏడాదిలో మరింత ఉత్సాహంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. జిల్లాలో పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, చెక్ పోస్టుల వద్ద మరింత నిఘా పెట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, పూర్తిగా అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మత్తు పదార్థాల నియంత్రణపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొత్త ఏడాదిలో కొత్త ఆలోచనలతో ముందుకు నడిచి పోలీసు ప్రతిష్టను పెంచే విధంగా పని చేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏవో సుజాత, డీఎస్పీలు విజయ్ కుమార్, శివన్నారాయణ స్వామి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎస్బి సీఐ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి, డీసీఆర్‌బీసీఐ శ్రీనివాసులు, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఎస్‌పీసీసీ రాఘవేంద్ర, సూపర్డెంట్ సరస్వతి, ఆర్ఐలు మహమ్మద్ వలి, మహేష్, సీఐలు, ఎస్సైలు, డీపీఓ సిబ్బంది, ఏఆర్ జిల్లా పోలీస్ శాఖ సిబ్బంది, ప్రముఖులు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## కైకలూరులో సులభ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

**- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

**- బీజేపీ నాయకులు కీర్తి**



**కైకలూరు, జనవరి 2 (జనస్వరం) :** పట్టణంలో ప్రజల సౌకర్యార్థం సులభ కాంప్లెక్సు, ఆర్వో వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ చేయాలని బీజేపీ నాయకులు కీర్తి రాం ప్రసాద్, బొల్లా శ్యామల రాజ్‌లు గురువారం జరిగిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె వెట్రి సెల్వికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రంలో నిత్యం వేల సంఖ్యలో కైకలూరు పరిసర గ్రామాల నుండి ఏదో పని మీద కైకలూరుకు వస్తూ ఉంటారని, వచ్చే ప్రజలకు ముఖ్యంగా మహిళలకు మలమూత్ర విసర్జన తీర్చుకొనుటకు అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కైకలూరు గ్రామంలో వ్యాపారస్తులు, వ్యాపార సంస్థలలో పనిచేసే కార్మికులు కూడా అవస్థలకు గురవుతున్నారు. ప్రజా సౌకర్యముల నిమిత్తం సులభ కాంప్లెక్సు ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతగానో ఉంది. ముఖ్య కూడలిలో అనగా సంత మార్కెట్, గాంధీ విగ్రహం సెంటర్, కోరుకొల్లు ఆటోస్టాండ్, కలిదిండి ఆటో స్టాండ్, వెంకట రమణ సినిమా హాల్ సెంటర్లు వద్ద సులభా కాంప్లెక్సు నిర్మించవలసిన అవసరం ఎంతగానో ఉంది. అదేవిధంగా 2011లో కైకలూరు మంచినీటి చెరువు పక్కగా ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరణ చేయాలని, పాలకులు ప్రజా అవసరాలు, ప్రజల ఇబ్బందులను గుర్తించి వీలైనంత త్వరలో సులభ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టి వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరణ చేయాలని కోరారు.

## హైందవ శంఖారావానికి తరలిరండి



**దెందులూరు, జనవరి 2 (జనస్వరం) :** దేవాలయాల రక్షణ కోసం ఈనెల 5 తేదీన గన్నవరం విమానాశ్రయం దగ్గర లైలా గ్రీన్ మేడోస్‌లో జరిగే హైందవ శంఖారావానికి లక్షలాదిగా ప్రజలు తరలి రావాలని దేవాలయాల పరిరక్షణ సేవా సంఘం సభ్యులు పెనుమాక వాసు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ విశ్వ హిందూ పరిషత్ రామదండుతో పాటు హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సంస్థల సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. భావితరాలు మార్గదర్శకంగా స్ఫూర్తిదాయకంగా జీవించేందుకు విశ్వహిందూ పరిషత్ రామదండు ఇతర సంస్థలు చేస్తున్న సేవల దృష్టిలో పెట్టుకొని దేవాలయాల పరిరక్షణ కోసం హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని వాసు కోరారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా ముక్కా సత్యనారాయణ



**పాలకొల్లు, జనవరి 2 (జనస్వరం) :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా ముక్కా సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్‌లు స్వయంగా అందజేశారు. గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ సమావేశం పాలకొల్లు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్, నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాలరావు పాల్గొన్నారు. గణేష్ భవాని మాట్లాడుతూ చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించాలంటే ఆర్ కృష్ణయ్యకు కేంద్ర మంత్రిగా అవకాశం కల్పించాలన్నారు. వనమాల మాట్లాడుతూ బీసీ రాజకీయ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా విభజించి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్షులు ముక్కా సత్యనారాయణ మాట్లాడుతూ బాధ్యతగా పనిచేసి సంఘ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వింజరపు శంకరం, కోరుకొండ సుబ్బారావు, తమ్మిరి వెంకటేశ్వరావు, నిలంశెట్టి సత్యప్రసాద్, మామిడిశెట్టి పెద్దిరాజు, వివిధ బీసీ కులాలకు చెందిన నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేయడం బావ్యంకాదు

**రాజ్య సభ మాజీ సభ్యులు తులసిరెడ్డి**



**పులివెందుల, జనవరి 2 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతను నమ్మించి మోసగి ంచడం భావ్యం కాదని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చే దానికి ప్రధాన కారణం సూపర్ సిక్స్ హామీలు అన్నారు. అందులో యువతకు సంబంధించి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీలను యువత నమ్మింది మూకుమ్మడిగా కూటమికి ఓట్లు వేశారు. కూటమి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించిందని, ఏరు దాటినంత వరకు ఓడ మల్లన్న, దాటాక బోడి మల్లన్న అన్న విధంగా తయారయిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కాదు గదా 20 వేల ఉద్యో గాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు కాదు కదా 3 పైసలు కూడా ఇవ్వలేదు. ఏడాదికి రూ.7200 కోట్లు కావాలి. బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదని తెలిపారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజునే చంద్రబాబు 16,347 ఉపాధ్యాయ పోస్టు ల భర్తీకి మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారన్నారు. యువత సంతోష పడిందని, డిసెంబర్ నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రభుత్వం చెప్పింది. టెట్ కూడా పూర్తి అయి 3 నెలలయి ంది. కానీ తొలి సంతకమైన డీఎస్సీకి 7 నెలలైనా దిక్కు లేదన్నారు. తొలి సంతకానికే దిక్కు లేకపోతే మిగతా హామీలు ఎప్పుడు అమలవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇరవై లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం తక్షణం అడుగులు వేయాలని, నిరుద్యోగ భృతిని ఈ జనవరి నెల నుంచి అయినా అమలు చేయాలని, మెగా డియస్సీకి వెంటనే షెడ్యూల్ ప్రకటించి 16,347 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## కానరాని డ్రైడే ఫ్రైడే, రోడ్లపై మురికి నీరు..

**తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు**



**కొత్తచెరువు, జనవరి 2 (జనస్వరం) :** మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, నిర్మాణాలు పూర్తి కాక సగంలో ఆగిపోవడంతో రోడ్లపై మురికి నీరు ఉప్పొంగి పొర్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వేణుగోపాల్ స్వామి కాలనీ వీధుల్లో మట్టి రోడ్లు కావడంతో నివాసాల ముందు డ్రైనేజీ సౌకర్యం లేక మురుగునీరు రోడ్లపై పారుతోందని స్థానికులు వాపోతున్నారు. కాలనీ మధ్యలోనే నీళ్లు పేరుకుపోయి ఎక్కడికక్కడ మురికినీటి గుంతల్లా మారాయని వీటివల్ల దోమలు వృద్ధి చెంది, దుర్గంధంతో గ్రామాల్లో జ్వరాల బారిన పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యశాఖ అధికారులు, పరిసరాల పరిశుభ్రత పరిశీలించకపోవడంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే విషయాన్ని ముందస్తుగా గుర్తించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విష జ్వరాలు, డెంగ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అనునిత్యం ఎవరో ఒకరు వ్యాధుల బారిన పడి ఉంటామని కాలనీవాసులు గోడు వెళ్ళ బోసుకుంటున్నారు. ఎవరైనా మృత్యువాత పడితే తప్ప ఆరోగ్య శాఖ అధికారులు ఆ మురికి నీటిపై లార్వా నివారణ మందులు చల్లుతారే తప్ప గుంతలను పూర్తిగా మూసి వేయించే పరిష్కారం ఏ ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎటువంటి ఫలితం లేకపోయింది అన్నారు. పత్రికలలో కథనాలు ప్రచురించినప్పుడు మాత్రం వైద్య చికిత్సలు అందిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పంచాయితీ అధికారులు, వైద్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అపరిశుభ్రమైన నీరు రోడ్లపై పారకుండా శాశ్వతమైన పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కదిరిలో మన్మోహన్ సింగ్ సంతాప సభ



**కదిరి, జనవరి 2 (జనస్వరం) :** ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి సత్యసాయి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఎన్ హెచ్ ఇనాయతుల్లా, కదిరి కాంగ్రెస్ సీనియర్ నాయకులు నగిరి శ్రీహరి ప్రసాద్ ఆదేశాల మేరకు మన్మోహన్ సింగ్ సంతాప సభ చిలమత్తూరు మోహన్ గాంధీ ఆధ్వర్యంలో ఇందాదుల్లా ఖాన్, ఖుదా బకాష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. తొలుత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కదిరి కాంగ్రెస్ నాయకులు చిలమత్తూరు మోహన్ గాంధీ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల పితామహుడు భారతదేశ ఆర్థిక రూపశిల్పి డాక్టర్ మన్ మోహన్ సింగ్ అన్నారు. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు సమాచార హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం,ఆహార భద్రతా చట్టం తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ మన్మోహన్ సింగ్‌దే అని కొనియాడారు. దేశ ప్రధానిగా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, అయన అందించిన సేవలు మరువలేనివన్నారు. మన్మోహన్ సింగ్ సారథ్యంలో భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అలాగే ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక మాంద్యం ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడకుండా గాడిలో పెట్టిన ఘనత మన్మోహన్ సింగ్‌దేనని వారి సేవలను గుర్తు చేశారు. సైలెంట్ ప్రైమ్ మినిస్టర్ అంటూ తనను ప్రస్తావించడాన్ని మన్మోహన్ సింగ్ ఖండించేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇందాదుల్లా ఖాన్, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కెకె ఖుదబకష్ అశ్రాఫ్, కదిరి మహిళా అధ్యక్షురాలు నీలోఫర్, మైనార్టీ ప్రెసిడెంట్ శోకత్ అలీ ఖాన్, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ వెల్డర్ బావ షేక్ ఇర్ఫాన్, తనకల్లు మాస్తాన్, ఇస్మాయిల్, చందు, మహేష్, జాఫర్ పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్‌లో వ్యక్తిత్వ వికాసంపై అవగాహనా సదస్సు



**చీరాల, జనవరి 2 (జనస్వరం) :** చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో, వ్యక్తిత్వ వికాసంపై అవగాహనా సదస్సును నిర్వహించినట్లు, కళాశాల సెక్రటరీ వనమా రామ కృష్ణారావు, కరస్పాండెంట్ యస్.లక్ష్మణ రావులు సంయుక్తంగా తెలియజేశారు. ఈ అవగాహనా సదస్సులో గుంటూరు వివిఐటి సివిల్ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ అండ్ డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి పాల్గొన్నారని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ బాబు తెలిపారు. ఈ పర్సనాలిటి డెవలప్‌మెంట్‌కు సదస్సులో సివిల్ ఇంజనీరింగ్ విభాగ విద్యార్థులు పాల్గొన్నారని సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.కిరణ్ కుమార్ తెలిపారు. ఎన్.కుమారస్వామి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తాము అనుకున్నది సాధించాలంటే, బాధ్యతతో తమ విధులను నిర్వహించాలని తెలిపారు. బాధ్యత అనేది ఎవరికి వారు భావించాలే తప్ప, ఎవరైనా చెపితే గాని, తెలియజేస్తే తెలిసేది కాదని తెలిపారు. తమ మనస్సును లక్ష్యంపై ఎలా దృష్టి పెట్టాలో సవివరంగా తెలియజేశారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగ విద్యార్థులు ఎ.ఐ.ఆధారిత కోర్సులైన ఒపెన్ స్పేస్, పీల్డ్ వైర్, ఎవిరా ఇన్‌సైట్, సివిల్స్, బిల్డ్ ఎఐ, ఆల్‌సైట్ ఎ.ఐ.వంటి ఆ ధునిక కోర్సులను అభ్యసించినట్లైతే, ఉన్నత ఉద్యోగ అవకాశాలను పొందవచ్చునని వివరించారు. సదస్సులో సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్.ఓ.వాటర్ ప్లాంట్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



**బాపట్ల, జనవరి 2 (జనస్వరం) :** నియోజకవర్గ పరిధిలోని పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలో మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్.ఓ వాటర్ ప్లాంట్‌ని నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు సాంబిరెడ్డి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, పిట్టలవానిపాలెం బీజేపీ నాయకులు రామకృష్ణ, శ్రీని వాసరాజు, ఖాజీపాలెం గ్రామ టీడీపీ ప్రెసిడెంట్ దండు శ్రీనివాసరాజు, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద అసోసియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ సంఘ సామాజిక సేవలు ప్రశంసనీయం

**ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య**




**చీరాల, జనవరి 2 (జనస్వరం) :** స్వామి వివేకానంద అసోసియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ సంఘ సామాజిక సేవలు ప్రశంసనీయమని నిర్వాహకులను ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య అభినందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శ్రీ స్వామి వివేకానంద అసోసియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చేతుల మీదుగా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ వివేకానంద ఫ్రెండ్స్ సంస్థ ద్వారా, సమాజానికి చేస్తున్న వివిధ సేవలు, అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి, ఏపీ బీజేపీ ఓబీసీ నాయకులు డాక్టర్ నాసిక శివాజీ, కోశాధికారి పింజల శైలజ, దేవాంగపురి టీడీపీ సీనియర్ నేత సిద్ధి వెంకట బుచ్చేశ్వరరావు, దున్నా శేష లక్ష్మి, చిన్నారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పృథ్వి లలిత మోహన్ తదితరులు పాల్గొన్నారు.